# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 05-02-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **సాగునీటి సంఘాల అధ్యక్షులతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు సమావేశం కానున్నారు.**

2. **తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'షీల్డ్ 2.0' కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి ఈ రోజు ప్రారంభిస్తారు.**

3. **ఆంధ్రప్రదేశ్ లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేస్తున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.**

4. **అమరావతిలో అంతర్జాతీయ క్రీడా నగరం నిర్మాణానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ మంత్రి పి.నారాయణ పేర్కొన్నారు.**

==========================

అమరావతిలో "జలం – మన బలం" పేరుతో నిర్వహించే కార్యక్రమంలో సాగునీటి సంఘాల అధ్యక్షులతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు సమావేశం కానున్నారు. 'మన నీరు–మన భవిష్యత్తు, తాగు నీటి సంఘాల ప్రాత' అంశంపై సదస్సు జరగనుంది. ఈ కార్యక్రమంలో సాగునీటి సంఘాల అధ్య క్షులు, సభ్యులు పాల్గొననున్నారని, నీటి భద్రత, భూగర్భ జలాల పెంపు వంటి విధానాలపై ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేస్తారని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం నిర్వహణపై జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ,

వాయిస్..30 సెకన్లు

---------------------------

వెనుకబడిన వర్గాల వారిని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో బీసీ సంక్షేమశాఖపై ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, ఆదరణ 3 పథకం ద్వారా కులవృత్తుల వారీగా ఆధునిక పరికరాలను పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. బీసీ వసతి గృహాల్లో పరిశుభ్రతతో పాటు విద్యార్థులకు అందించే ఆహార నాణ్యతపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని స్పష్టం చేశారు. పాఠశాలలు, వసతిగృహాల నిర్మాణంతో పాటు సురక్షిత తాగునీటి కోసం నీటి శుద్ధి ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

---------------------------

సైబర్ నేరాల నియంత్రకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో –టీజీసీఎస్‌బీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'షీల్డ్ 2.0' కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి ఈ రోజు ప్రారంభిస్తారు. జాతీయస్థాయి సైబర్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ 'సైఫర్ స్ప్రింట్'లో భాగంగా 'బాధితులకు రక్షణ.. డిజిటల్ భవిష్యత్తుకు భద్రత' అనే నినాదంతో నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా టీజీసీఎస్‌బీ రూపొందించిన సరికొత్త సైబర్ భద్రత సాధనాలను ముఖ్యమంత్రి ఆవిష్కరిస్తారు. రాష్ట్ర సాంకేతిక రక్షణ వ్యవస్థల్ని బలోపేతం చేయడంతోపాటు సైబర్ రంగంలో వినూత్న ఆవిష్కరణల్ని ప్రోత్సహించే దిశగా ఈ సదస్సు జరగనుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేస్తున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకిలోని కొమ్మినేనివారిపాలెంలో జిల్లా పరిషత్ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు సైకిళ్లను మంత్రి నిన్న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి రవికుమార్ మాట్లాడుతూ,

వాయిస్.. 25 సెకన్లు

---------------------------

వందేమాతరం 150 ఏళ్ల ఉత్సవాల్లో భాగంగా దేశంలోని తీరప్రాంతాల రాష్ట్రాల్లో "కోస్టల్ సైక్లోథాన్--2026" ను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఈ సైక్లోథాన్ తూర్పు, పశ్చిమ తీర రాష్ట్రాల మీదుగా ఈ నెల 21న కేరళ రాష్ట్రంలోని కొచ్చి వద్ద ముగియనుంది. తూర్పు తీర రాష్ట్రాలలో జరుగుతున్న సైక్లోథాన్ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా సోంపేటకు ఈ రోజు చేరుకుంటుంది. రాష్ట్రంలో ఈ సైక్లోథాన్ యాత్ర ఈ నెల 12 వ తేదీ వరకు విశాఖపట్నం, కాకినాడ, కృష్ణా, బాపట్ల, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల మీదుగా తమిళనాడులోని చెన్నై చేరుకోనుంది. దేశవ్యాప్తంగా తీర ప్రాంతాల్లో జాతీయ ఐక్యత, ఆరోగ్యంపై అవగాహన, దేశభక్తి భావనను పెంపొందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ సైక్లోథాన్‌ను నిర్వహిస్తోంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని కోటప్పకొండ తిరునాళ్లకు రాష్ట్ర ప్రభుత్వం 30 లక్షల రూపాయలను మంజూరు చేసిందని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. పల్నాడు జిల్లాలోని కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామిని ఆయన నిన్న దర్శించుకున్నారు. అనంతరం పల్నాడు జిల్లా ఇన్చార్జి మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తో కలిసి మహాశివరాత్రి తిరునాళ్ల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రామనారాయణరెడ్డి మాట్లాడుతూ,

వాయిస్ ..30 సెకన్లు

---------------------------

రాజధాని అమరావతిలో అంతర్జాతీయ క్రీడా నగరం నిర్మాణానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. విదేశీ పర్యటనలో భాగంగా ఖతార్ రాజధాని దోహాలోని క్రీడా నగరాన్ని అధికారులతో కలిసి మంత్రి నిన్న సందర్శించారు. ఈ సందర్భంగా ఖలీఫా అంతర్జాతీయ స్టేడియం, ఆస్పిటర్ క్రీడా అకాడమీలను పరిశీలించి వాటి ప్రత్యేకతలు అడిగి తెలుసుకున్నారు. 2022 ఫిఫా

వరల్డ్ కప్ నిర్వహించిన లుసైల్ స్టేడియాన్ని మంత్రి పరిశీలించారు. అమరావతిలో అంతర్జాతీయ క్రీడా నగరం నిర్మాణానికి అవసరమైన ప్రణాళికపైనా దోహా అధికారులతో చర్చించారు.

---------------------------

తెలంగాణలో ప్రధాన రైల్వే ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణలో జాప్యం జరుగుతోందని, దీంతో ప్రాజెక్టులు ఆలస్యమవుతున్నాయని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా లోక్‌సభలో పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు సమాధానమిచ్చారు. తెలంగాణలోని ప్రాజెక్టుల కోసం 2,343 హెక్టార్ల భూమి అవసరం కాగా, ఇప్పటివరకు 1,580 హెక్టార్లే సేకరించారని తెలిపారు.

---------------------------

అండర్–19 వన్డే ప్రపంచ కప్ లో భాగంగా జింబాబ్వే లోని హరారెస్టేడియం వేదికగా భారత్, అఫ్గానిస్థాన్ జట్ల మధ్య నిన్న జరిగిన 2వ సెమీ ఫైనల్ క్రికెట్ మ్యాచ్‌లో అఫ్గానిస్థాన్ ను ఏడు వికెట్ల తేడాతో ఓడించి, ప్రపంచ కప్ ఫైనల్స్‌లోకి భారత్ అడుగుపెట్టింది. ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన అఫ్గానిస్థాన్.. నాలుగు వికెట్ల నష్టంతో 310 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ కు దిగిన భారత్ జట్టు 41.1 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 311 పరుగుల లక్ష్యాన్ని చేరుకుని విజయం సాధించి ఫైనల్ కు చేరుకుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో పగటిపూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నప్పటికీ తెల్లవారుజామున, రాత్రివేళల్లో చలి తీవ్రత కొనసాగుతోంది. రెండు రాష్ట్రాల్లోనూ పొడి వాతావరణం కొనసాగుతోందని, కొన్ని ప్రాంతాల్లో పొగమంచు ఏర్పడే అవకాశముందని భారత వాతావరణ శాఖ తెలిపింది.

ఇక మన్యం ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకులోయలో 10.6 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా... తెలంగాణా కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్‌లో 12.6 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో ఖాళీగా ఉన్న దివ్యాంగులకు ఉద్దేశించిన బ్యాక్ ల్యాగ్ పోస్టులు మార్చిలోపు భర్తీ చేయాలని దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో దివ్యాంగులకు యుడిఐడి కార్డులు, మూడు చక్రాల మోటార్ బైక్‌ల పంపిణీ, దివ్యాంగుల పాఠశాలల్లో అడ్మిషన్లు వంటి అంశాలపై అధికారులతో మంత్రి నిన్న సమీక్షించారు.

=====================